సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విశాఖ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది ఇక్కడ విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనులు జరగనుండడంతో శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపుతో పాటు మరమ్మతులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌నగర్, ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, తదితర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ శాంతిపై 20న సదస్సు

మద్దిలపాలెం : డాక్టర్ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియన్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి అంశంపై సదస్సు జరగనుందని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా 90324 77463 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో మంగళవారం సాయంత్రం జరిగిన నారాయణరావు హత్య కేసులో నిందితుడు రాంబాబును ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. అష్టాచెమ్మ ఆట సమయంలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం నారాయణరావు హత్యకు దారితీసింది. నిందితుడు రామారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రైతుబజార్‌లో ఉచిత వైద్య శిబిరం



వినియోగదారులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వినియోగదారులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు.

రైతుబజార్‌కు శ్రావణ శోభ

సీతమ్మధార: మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. గురువారం సాయంత్రం బజారులో పండ్లు, పూలు, మామిడి కొమ్మలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటాకులు, చెరుకుగడలతోపాటు ఇతర పూజా సామగ్రి కొనుగోలు చేశారు. ఏ స్టాల్ వద్ద చూసినా మహిళల సందడి కనిపించింది.

సీజనల్ వ్యాధులపై యుద్ధం

- వ్యాధులు ప్రబలకుండా జోన్-3లో విస్తృత కార్యాచరణ
- వార్డుల వారీగా పెద్ద ఎత్తున ఫాగింగ్‌కు చర్యలు
- ఫలితాలిస్తున్న గుంబూషియా, ఆయిల్ బాల్స్ విడుదల



డెంగ్యూ, మలేరియాపై ముందస్తు అవగాహన ర్యాలీ



19వ వార్డులో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ఎంవీపీ కాలనీ: సీజనల్ వ్యాధుల నివారణపై జీవీఎంసీ ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో జోన్-3 ఆరోగ్య శాఖ, మలేరియా విభాగ సిబ్బంది ఈ మేరకు పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారంతో పాటు అవగాహన కార్యక్రమాలు, సర్వేలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. జోన్-3 పరిధిలోని అన్ని వార్డుల్లో ఇంటింటి సర్వే నిర్విరామంగా జరుగుతోంది. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అప్రమత్తం చేయడంతో పాటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వ్యాధులు ప్రబలే సమీప ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఫాగింగ్, నీటి తొట్టెల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఏడాది భారీగా తగ్గిన కేసులు

గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది మలేరియా, డెంగ్యూ కేసు సంఖ్య భారీగా తగ్గినట్టు జీవీఎంసీ అధికారులు వెల్లడించారు. జోన్-3 పరిధిలో ప్రస్తుతం 15 కేసులు నమోదు కాగా.. ఇందులో 3 మలేరియా, 11 డెంగ్యూ కేసులు ఉన్నట్లు తెలిపారు. జోన్-3 పరిధిలోని 25, 27 వార్డుల్లో రెండేసి కేసులు.. 23, 21, 20, 18, 17 వార్డుల్లో ఒక్కో కేసు నమోదైనట్లు వెల్లడించారు. వ్యాధుల నివారణలో గుంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్ ముందస్తు విడుదల ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు చెబుతున్నారు. వీటి ద్వారా దోమల లార్వాను నియంత్రించి దోమల ఉధృతికి అడ్డుకట్ట వేశారు. కేసుల గుర్తించిన ప్రాంతాల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది విస్తృత ప్రచారంతో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రత, వ్యర్థనీటి కుంటల్లో చేపలు, ఆయిల్ బాల్స్ విడుదల ద్వారా కేసులు పెరగకుండా నియంత్రిస్తున్నారు.

60 వేల గుంబూషియా చేపల విడుదల



గుంబూషియా చేపలు విడుదల చేస్తున్న సిబ్బంది

దోమల వ్యాప్తిని నివారించడంలో 6 మిల్లీమీటర్లు పొడవు ఉండే గుంబూషియా ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. వీటికి దోమల లార్వాను ఆహారంగా స్వీకరించే సహజ గుణం ఉంది. ఇవి రోజుకు 100 లార్వాలను, గుడ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో దోమలను నివారించేందుకు వ్యర్థ నీటి కుంటలు, ఫౌంటైన్లలో పెద్ద ఎత్తున వీటిని విడుదల చేస్తున్నారు. మలేరియా, శానిటేషన్ విభాగాల సిబ్బంది వార్డుల వారీగా గుర్తించిన ఫౌంటైన్లు, నీటి కుంటల్లో చేపల విడుదల కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. జోన్-3 పరిధిలో తొలివిడతగా 40 వేలు చేప పిల్లలను విడుదల చేయగా.. రెండో విడతగా 20 వేల చేపలను విడుదల చేశారు.

‘స్టేడియంల నిర్వహణ బాధ్యత జీవీఎంసీదే’



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం : స్వర్ణభారతి స్టేడియంతో పాటు జీవీఎంసీ పరిధిలోని మిగతా స్టేడియంలన్నింటిని జీవీఎంసీ నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు కోరారు. పిఠాపురం కాలనీలో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలోని స్టేడియంలను ప్రైవేటు వ్యక్తులకు లీజు ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారన్నారు. మధ్య తరగతి చిన్నారులు ఫీజులు కట్టలేక స్టేడియంలకు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్టేడియంలను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే యోజనను విరమించుకోవాలని ఆయన కోరారు.

రిపోర్టర్‌పై దాడి చేసిన నిందితులను శిక్షించాలి



రూరల్ తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న ఆరిలోవ పాత్రికేయులు

ఆరిలోవ: సాక్షి టీవీ చానల్ రిపోర్టర్ సురేష్‌పై దాడి చేసిన టీడీపీకి చెందిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 15న ఆర్‌కే బీచ్ వద్ద జరిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సభ కవరేజీ కోసం వెళ్లిన ఆరిలోవ సాక్షి టీవీ చానల్ రిపోర్టర్ సురేష్‌పై కొందరు టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. సురేష్ సెల్‌ఫోన్ తీసుకుని చేయి చేసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దారు రమణయ్య ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

108 సిబ్బంది సాయం



రమణ కుటుంబానికి సహాయం అందిస్తున్న 108 జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు

మహారాణిపేట: రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచాన పట్టిన 108 వాహన డ్రైవర్ గాడు రమణకు తోటి సిబ్బంది గురువారం సాయం అందజేశారు. 108 జిల్లా సమన్వయకర్త బి.శ్రీనివాసరావు మధురవాడలో నివాసం ఉంటున్న రమణ ఇంటికి వెళ్లి లక్ష రూపాయలు అందజేశారు. గతంలో రూ.97,500 సహాయాన్ని అందజేసిన సంగతి విదితమే. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్ కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.బంగారురాజు, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు ఎన్.త్రినాథ్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్ని నాయుడు పాల్గొన్నారు.

బౌద్ధారామాలను పరిరక్షించాలి



బావికొండపై బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, తదితరులు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో గల బావికొండ, తొట్లకొండ, భీమిలిలో గల పావురాల కొండపై గల బౌద్ధారామాలను పరిరక్షించాలని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కోరారు. గురువారం ఈ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం కల్పించి, రహదారులు నిర్మించాలని, తొట్లకొండపై నిర్మించిన మ్యూజియం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బౌద్ధారామాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర కోశాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గైస్ పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. 1971-1975 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కాలేజీలోని అన్ని బ్రాంచీలకు చెందిన టాపర్లకు ప్రోత్సాహక బహుమతులతోపాటు కాలేజీ ఫైనలియర్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. బ్రాంచీల వారీగా బాలికలు, బాలురుల్లో టాపర్‌తోపాటు కాలేజీ టాపర్స్ రూ.10,000 చొప్పున బహుమతులను పూర్వ విద్యార్థులు అందజేస్తారని పేర్కొన్నారు.

వచ్చే నెల 15వ తేదీ వరకు పూజలు

దాబాగార్డెన్స్: దేవస్థానంలో వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నామని.. పూజకు అవసరమయ్యే సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందని ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూజ అనంతరం ఉభయదాతలకు కండువా, జాకెట్టు, రాగి స్టాండ్ యంత్రం, పులిహోర, చక్కెరపొంగలి అందజేస్తామన్నారు. గురు/శుక్రవారాలు మినహా ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు, గురు/శుక్రవారాల్లో రెండు బ్యాచ్‌లుగా ఉదయం 8 నుంచి 9, 9.30 నుంచి 10.30 గంటలకు పూజలు నిర్వహిస్తామన్నారు. పరోక్షంగా పూజ చేసే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు జమ చేసి, పేరు, గోత్రం, చిరునామా వివరాలను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయవచ్చు. ఆన్‌లైన్ సేవలు/పూజా టికెట్లు https:// www. aptemples. ap. gov. inలో లభిస్తాయని ఈవో వెల్లడించారు.

కాలానికి అనుగుణంగా ఆవిష్కరణలు

ఏయూ క్యాంపస్: మారుతున్న కాలానికి అనుగుణంగా నిరంతరం ఆవిష్కరణలు జరపాల్సిన అవసరం ఉందని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఆఫర్ మార్కెటింగ్-బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ పాఠక్ అన్నారు. గురువారం నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఇన్నోవేషన్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్నోవేషన్‌కు సమగ్ర విధానాలు కావాలని, దీనిలో మెరుగైన భాగస్వాములను కలిగి ఉండాలని సూచించారు. అజినోమోటో బయో ఫార్మా సీనియర్ మేనేజర్ విక్రమం సేన్ రెడ్డి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధికి ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా చేస్తున్న కృషిని అభినందించారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా గ్లోబల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ రజత్ అబ్బి మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా దేశంలో తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు.

సమస్యల పరిష్కారమే ఎన్ఎంయూఏ లక్ష్యం

మద్దిలపాలెం : ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎంయూఏలో సభ్యులుగా చేరిన 30 మందిని మద్దిలపాలెం అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు మోహన్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

హెటిరో డ్రగ్స్‌లో ఉద్యోగాలకు 21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక : ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 21న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు, 2019-2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.70 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపు కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

ఎఫ్‌సీఐలో కొత్త కోర్సు ప్రారంభం


ఆరిలోవ: ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో గురువారం కొత్త కోర్సు ప్రారంభమైంది. డైరెక్టర్ జనరల్ రీ సెటిల్‌మెంట్ కోర్సుల్లో భాగంగా ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభించారు. ఇందులో 41 మంది చేరారు. ఇది మూడు నెలల కాలవ్యవధి గల కోర్సు అని ఎఫ్‌సీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి రమణ తెలిపారు. దీంతో పాటు ప్రస్తుతం అసిస్టెంట్ కేటరింగ్ మేనేజర్ కోర్సులో 30 మందికి శిక్షణ జరుగుతుందన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రవేశాలకు ఈనెల 21 వరకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. https://ignouadmission.samasth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పబ్లిక్ డిమాండ్

కుంగిపోతున్న రోడ్డు



మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం నుంచి పీతలవానిపాలెం వెళ్లే మార్గంలో షిర్డీసాయి మందిరం వద్ద రోడ్డు కుంగిపోతోంది. ఈ రోడ్డు మధ్య నుంచి యూజీడీ పైపులైన్ ఉంది. ఇక్కడ రోడ్డు మధ్య కుంగిపోయి పెద్ద గొయ్యిగా ఏర్పడింది. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే సంబంధిత జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– పి.శ్రీను, పీతలవానిపాలెం

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

అనధికారక అంతస్తుల కూల్చివేత



విశాలాక్షినగర్ ఎస్టీ కాలనీలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగిస్తున్న అదనపు అంతస్తు

ఆరిలోవ: జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారక భవన నిర్మాణాలపై కన్నెర్ర చేశారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను కొద్ది రోజులుగా తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో రెండు చోట్ల అనధికారికంగా నిర్మించిన అదనపు అంతస్తులను కూల్చివేశారు. ఆయా చోట్ల అనధికార నిర్మాణాలు జరుగుతున్నట్టు గుర్తించిన జీవీఎంసీ రెండో జోన్ ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాలతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, స్క్వాడ్ బృందంతో వెళ్లారు. జాతీయ రహదారిని ఆనుకుని వెటర్నరీ కాలనీలో ఓ వ్యక్తి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని, అనధికారికంగా ఐదో అంతస్తు నిర్మాణం చేపట్టాడు. ఆ అదనపు అంతస్తును స్క్వాడ్ బృందం తొలగించింది. అనంతరం దీనికి సమీపంలో ఎస్టీ కాలనీలో ఓ వ్యక్తి కూడా నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని అనధికారికంగా ఐదో ఫ్లోర్ నిర్మించేశాడు. ఆ ఫ్లోర్‌ను కూడా సిబ్బంది తొలగించారు. అనుమతులు ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఏసీపీ వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా సూచించారు. అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను ఏ స్థాయి వ్యక్తులకు సంబంధించినవైనా తొలగించేస్తామని ఆయన హెచ్చరించారు.

ఏయూ సమాచారం

అందరికీ చేరువలో ఆయుర్వేద సేవలు



రోగులకు పరీక్షిస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: ప్రజలందరికీ ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్నట్టు ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తెలిపారు. యోగా విలేజ్‌లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కేజీహెచ్‌లో సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ రోగులను పరీక్షించి అవసరమైన ఔషధాలు సూచించారు. గతేడాది డిసెంబర్ నుంచి ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఇప్పటి వరకు 230 మందికిపైగా సేవలు వినియోగించుకున్నారని భానుకుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 32 శాతం ఆర్థరైటిస్, 20 శాతం జీర్ణకోశ సంబంధ, 16 శాతం చర్మ సంబంధ, 15 శాతం మానసిక సంబంధ సమస్యలకు చికిత్స అందించామన్నారు. ఆయుర్వేదంలో పేర్కొన్న పంచకర్మ చికిత్సల సహాయంతో జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవచ్చునని చెప్పారు.

బీఐఎస్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ సంతకాలు చేశారు. రెండు సంస్థలు సంయుక్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, సింపోజియంలను నిర్వహించనున్నాయి. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల నిర్వహణ, భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే దిశగా నిర్ణయం తీసుకున్నారు. స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధిత తరగతులను సంయుక్తంగా నిర్వహించనున్నారు.

హిందీ విభాగంలో నేడు సదస్సు

ఏయూ క్యాంపస్: హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో మాండలికాల పాత్ర అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో శుక్రవారం ఒక రోజు సదస్సు జరగనుంది. విశాఖ హిందీ పరిషత్, ఉత్తరప్రదేశ్‌కి చెందిన అవధి సాహిత్య సంస్థ సంయుక్తంగా నిర్వహించే ఈ సదస్సును ఉదయం 10 గంటలకు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ప్రారంభించనున్నారు. హిందీ భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మత్తు పదార్థాలకు బానిసైన ఓ యువకుడు ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌కు చెందిన జి.లక్ష్మీనారాయణ అలియాస్ చందు(20) గంజాయికి బానిసయ్యాడు. కొన్నాళ్ల క్రితం తండ్రి మరణించడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణ కేటరింగ్ పని చేసేవాడు.

ఆర్థిక సమస్యలతో..

ఎంవీపీ కాలనీ: కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలపాలెం కృష్ణా కళాశాల వెనుక భానునగర్‌లో రాయుడు రామారావు(58) భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే రామారావు కొద్దికాలంగా ఆర్థిక ఇబ్బందులో సతమతమవుతున్నాడు. 10 నెలలుగా ఇంటి అద్దె కూడా చెల్లించకపోవడం, పిల్లలకు పాఠశాల ఫీజులు కట్టలేకపోవడంతో భార్య, భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ గొడవలు పడుతున్నారు.

ఈ నేపథ్యంలో రామారావు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంవీపీ పోలీసులు వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

